క్లుప్తంగా

లడ్డూ వేలం రూ.25వేలు

పిట్టలవానిపాలెం: మండలంలోని శ్రీ సిద్ధి వినాయక స్వామి దేవస్థానం వద్ద విఘ్నేశ్వరునికి గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. చలువ పందిళ్లలో విఘ్నేశ్వరుని విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరణ గావించి, పూజా కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన అక్కల శ్రీనివాసరెడ్డి రూ.22,500లకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. మండలంలోని పలు గ్రామాలలో వినాయక విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు.పిట్టలవానిపాలెం శివారులోని పంట కాలువలో నిమజ్జనం నిర్వహించారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో హక్కుల కోసం పోరాటం

భట్టిప్రోలు: భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు హక్కుల కోసం పోరాటం చేయాలని యూటీఎఫ్ మండల కార్యదర్శి వి. సురేష్‌కుమార్ అన్నారు. గురువారం భట్టిప్రోలులోని గాయత్రీ అకాడమిలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి. మనోజ్‌కుమార్, మండల అధ్యక్ష కార్యదర్శులు మొహిద్దీన్, జగదీష్, గాయత్రి అకాడమి డైరెక్టర్ కొండముది షణ్ముఖ శర్మ(బాబీ), పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భగత్ సింగ్‌కు ఘన నివాళి..

బాపట్ల అర్బన్: దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్ త్యాగం నిరుపమానమైనదని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పీసీ సాయిబాబు అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా గురువారం మండల కార్యాలయం వద్ద భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జంరుద్ బాషా, సుభాని, రెడ్డి రహెల్ పాల్గొన్నారు.

దుకాణంలో చోరీ

రేపల్లె రూరల్: సౌండ్స్ అండ్ లైటింగ్ దుకాణంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు పట్టణ సీఐ నజీర్ బేగ్ గురువారం తెలిపారు. పెనుమూడి రోడ్డులోని ఆర్చీ వద్ద నబీసా సౌండ్స్ అండ్ లైటింగ్ దుకాణంలో పని చేసే కూలీలు బుధవారం ఎప్పటి మాదిరిగా విధులు పూర్తిచేసుకుని నిద్రిస్తుండగా.. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దుకాణంలోని ఆవరణంలో ఉన్న రూ.3లక్షల విలువ చేసే డీజే సౌండ్ బాక్స్‌లతో పాటు విద్యుత్ దీపాల తీగలు అపహరించారన్నారు. బాధితుడు నబీసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సంక్షేమ బాటలో ప్రభుత్వం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- యడ్లపల్లిఓ గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

యడ్లపల్లి(వేమూరు): రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బాటలో పయనిస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరును వివరించారు. సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకొని రావాలని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించాలనే దృక్పథంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి గ్రామ సచివాలయం అభివృద్ధికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేస్తోందని, గ్రామంలో డ్రెయినేజ్‌లు, రోడ్లకు నిధులు వినియోగించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే ధ్యేయంగా పని చేస్తోందని ఆయన అన్నారు. సిల్క్ స్కాంలో దోపిడీ చేసి అన్ని అధారాలతో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు దొరికిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ ముంతాజీ బేగం, ఉప సర్పంచ్ చేవ సత్యనారాయణ, ఎంపీటీసీ నల్లబోతుల ప్రసన్న కుమారి, కో-ఆప్షన్ మెంబరు షేక్ అబ్దుల్, గొంధి సుభారాణి, ఆలపాటి సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు అన్నవరపు రఘు రామిరెడ్డి, మాజీ అధ్యక్షుడు గాదె శివరామ కృష్ణారెడ్డి, వలివేరు గ్రామ సర్పంచ్ పందిపాటి ఏసు, ఎంపీటీసీ అమర్తలూరు ప్రవీణ్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి



జాషువా విగ్రహానికి కాంగ్రెస్ నేతల నివాళి



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీనియర్ సిటిజన్స్

బాపట్ల అర్బన్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట అంజిబాబు ఆదేశాలతో పార్టీ మైనార్టీ అధ్యక్షుడు పఠాన్ రాజేష్ గురువారం గుర్రం జాషువా 128వ జయంతి నిర్వహించారు. స్థానిక ఏబీఎం హై స్కూల్‌లో జాషువా విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పఠాన్ రాజేష్ మాట్లాడుతూ నేటి యువత గుర్రం జాషువాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బక్కా రోశయ్య, దోనేపూడి రవి, నక్కల రాంబాబు, గాంధీ, శీలం సాగర్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

'గబ్బిలం' సమాజానికి ఒక సందేశం

బాపట్ల అర్బన్ : స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో మహాకవి గుర్రం జాషువా 128వ జయంతిని సాహితీ భారతి, సీనియర్ సిటిజన్స్ సంయుక్తంగా గురువారం నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా ప్రముఖ వక్త ఆర్ట్స్ కాలేజీ విశ్రాంత అధ్యాపకుడు జి.శాంతారామ్ మాట్లాడుతూ సమాజంలోని హెచ్చు తగ్గులను, వివక్షలపై తన గళాన్ని విప్పి చెప్పిన మహాకవి గుర్రం జాషువా అన్నారు. సాహితీ భారతి ఉపాధ్యక్షుడు మరి మాల్యాద్రి జాషువా రచనలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు కె. శ్రీహరి రావు, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్, కవి సాహితి భారతి అధ్యక్షుడు ఆర్ఎస్. వర్మ మస్తాన్‌వలి, బొలగాని వెంకటేశ్వర్లు, ఎం.తాతయ్య, కె. కాళిదాసు, కాగిత శ్రీహరి రావు, ఎస్. కృష్ణ, అవ్వారి వెంకటేశ్వర్లు ప్రసంగించారు.

అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం కూచిపూడిలో గుర్రం జాషువా 128వ జయంతి పురస్కరించుకుని గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు కూచిపూడి జయరావు, విశ్రాంత పోస్ట్ మాస్టర్ పి. జోసేఫ్, పులివర్తి రాజు, చావలి రమేష్, కె. భీమయ్య, సీపీఎం మండల కార్యదర్శి అగస్టీన్ పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

రేపల్లె రూరల్: మహ్మద్ ప్రవక్త చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఈద్గా కమిటీ అధ్యక్షుడు షేక్ జమీర్ అన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా గురువారం పట్టణంలో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. అల్లా మానవాళి శ్రేయస్సు, శాంతిని నెలకొల్పడం కోసం చిట్టచివరిగా ప్రవక్తగా మహ్మద్‌ను ఎన్నుకున్నట్లు దైవగ్రంథమైన ఖురాన్ షరీఫ్‌లో చెప్పబడిందన్నారు. ఈ సందర్భంగా జామియా మసీదు నుంచి ఇసుకపల్లి వరకు ముస్లింలు బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ ఫరిద్, లియాఖత్ బాషా, షేక్ మోహిద్దీన్, సయ్యద్ ఆరీఫుల్లా, షేక్ ఆరీఫా, అబ్దుల్లా, సయ్యద్ కరిముల్లా, మసీద్ ఇమ్మామ్‌లు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: మహ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్-ఉన్-నబీ వేడుకలను గురువారం ఘనంగా జరిగాయి. అద్దేపల్లి, భట్టిప్రోలు, వేమవరం, పల్లెకోన, వెల్లటూరు గ్రామాలలోని మసీదుల్లో 12 రోజులుగా మత గురువులు మహ్మద్ ప్రవక్త చరిత్రపై ప్రవచనాలు ఇస్తున్నారు. 12 రోజులుగా పాటిస్తున్న ఉపవాస దీక్షలు బుధవారంతో ముగిశాయి. ప్రవక్త మహ్మద్ సల్లేలాహు వసల్లమ్ జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పేదల జీవన ప్రమాణాలు పెంపొందించటమే జగనన్న లక్ష్యం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: పేదల జీవన ప్రమాణాలు పెంపొందిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తూ, ప్రజల మన్ననలు పొందుతున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కనగాల సచివాలయం-2 పరిధిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హామీలను నూరుశాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, ప్రజా ప్రతినిధులే ఆ సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించటమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఇంటింటికి వెళ్తున్నప్పుడు.. ప్రజలు స్వయంగా తాము పొందిన లబ్ధిని వివరిస్తున్నారని తెలిపారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్ననే కోరుకుంటున్నారి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పయనం ఏడుకొండలురెడ్డి, సర్పంచ్ షేక్ రజియా, నాయకులు ఫరూక్, కరిముల్లా, కొతరపు గణేష్, ఆరాధ్యుల వాసు, కనగాల బీఎడ్ కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ సమ్మద్ పాల్గొన్నారు.

బేతపూడిలో జగనన్న సురక్ష సర్వే



టోకెన్‌ను గ్రామస్తులకు అందజేస్తున్న ఆరోగ్యసిబ్బంది



గరువుపాలెంలో వైద్య పరీక్షలు నిర్వమిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ మురళీ

రేపల్లె: మోర్లగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బేతపూడి వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ క్లినిక్ సిబ్బంది ఇంటింటి సర్వే గురువారం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని, వివరాలను యాప్‌లో నమోదు చేశారు. 20 రోజులు పాటు సర్వే చేపట్టనున్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ రంగారావు తెలియజేశారు. బీపీ, షుగరు, హిమోగ్లోబిన్, యూరిన్, మలేరియా, డెంగీ వంటి పరీక్షలు హెల్త్ క్లినిక్ సిబ్బంది నిర్వహించి, టోకెన్లు పంపిణీ చేశారన్నారు. సర్వే అనంతరం అక్టోబర్ 17న బేతపూడి ప్రాథమిక పాఠశాల ఆవరణంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ జరుగుతుందన్నారు. ఈ క్యాంప్‌లోఇద్దరూ మెడికల్ ఆఫీసర్లు, ఒక గైనకాలజిస్ట్, ఒక జనరల్ ఫిజీషియన్ అందుబాటులోకి ఉంటారని, అన్ని రకాల పరీక్షలు , మందులు ఉచితంగా లభిస్తాయని చెప్పారు. ఈ అవకాశాన్ని బేతపూడి గ్రామస్తులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రమోద్, సూపర్‌వైజర్‌లు, సిహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఎంపీహెచ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా వైద్య పరీక్షలు

నిజాంపట్నం: ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కూచినపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ మురళీ తెలిపారు. మండలంలోని గరువుపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మురళీ మాట్లాడుతూ అక్టోబర్‌లో జరగనున్న మెడికల్ క్యాంప్‌లకు సంబంధించి, వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఏడు రకాల పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. శిబిరాల్లో పరీక్షలకు టోకెన్స్ తీసుకువచ్చి చూపించుకోవాలన్నారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఇలా..

వేమూరు: ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా.. వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకట సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 30 వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జరుగుతుందన్నారు. 30న చదలవాడ, అక్టోబరు 3న కుచ్చెళ్లపాడు, 4న వరహాపురం, 5న వేమూరు-1, 6న వేమూరు-2, 9న జంపని గ్రామం, 10న జంపని గ్రామం-2, 11న పెరవలిపాలెం గ్రామ సచివాలయం, 12న చావలి గ్రామం, 13న చావలి గ్రామం-2, 16న పెనుమర్రు గ్రామ సచివాలయం , 17న బలిజేపల్లి గ్రామ సచివాలయంలో వైద్య శిబిరాలు నిర్వహించి దీర్ఘ కాలిక వ్యాధులకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని డాక్టర్ జి.వెంకట సురేష్ తెలిపారు. వైద్యులు జి.వెంకట సురేష్, రవళీ, కోటేశ్వరి, సంతోష్ రాయల్, వెంకటలక్ష్మి, డాక్టర్ దుర్గ ప్రసాద్, వెంకటేష్ నాయక్ సేవలందిస్తారని తెలిపారు.

కర్లపాలెం: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రభుత్వం అందరికీ మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు అన్నారు. నల్రావారిపాలెం గ్రామంలో గురువారం ఆరోగ్య సురక్ష సర్వేలో ఆయన పాల్గొన్నారు. ప్రజలందరూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్ల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రమ్యారెడ్డి, ఏఎన్ఎం పార్వతీ, వైఎస్సార్ సీపీ నాయకుడు బెనర్జి, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బాపట్ల జిల్లా ఫొటో గ్రాఫర్స్‌కు బంగారు పతకాలు

బాపట్ల అర్బన్ : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ప్రొత్సాహంతో ఫొటోగ్రఫీ అకాడమి ఆఫ్ ఇండియా, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ విజయవాడ సంయుక్తంగా ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్టంలో నిర్వహించిన ఛాయాచిత్ర పోటీల్లో బాపట్ల మండలం ముత్తాయపాలేనికి చెందిన ఫొటోగ్రాఫర్ పీవీఎస్ నాగరాజు, ఆదర్శనగర్‌కు చెందిన సంగాని ఏడుకొండలు, నిజాంపట్నంకు చెందిన డబ్బుకూటి శ్రీనివాసరావుకు ప్రతిభా పురస్కారాలు, బంగారు పతకాలు దక్కాయి. విజయవాడలో బుధవారం బాలోత్సవభవన్‌లో జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో అడిషనల్ సీసీఎల్ఏ సెక్రెటరీ, సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్ చేతుల మీదగా అందుకున్నారు.

900 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

నిజాంపట్నం: నాటుసారా తయారీ, అమ్మకాలు చేస్తే ఉపేక్షించేది లేదని నగరం స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. దిండి పంచాయతీ అదవల గ్రామ శివారులోని మడ అడవుల్లో గురువారం దాడులు నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ నాటుసారా తయారీకి ఉపయోగించే 900 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చేయడం జరిగిందన్నారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని కూడా ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారీ, అమ్మకాలు చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

బాలకోటేశ్వరస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం

గోవాద(వేమూరు): శ్రీ బాల కోటేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ రాపర్ల నరేంద్ర అన్నారు. అమర్తలూరు మండలంలోని గోవాడలో శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం ఆలయ కమిటీ చైర్ పర్సన్‌గా ఆలపాటి రమాదేవి ప్రమాణస్వీకారం చేశారు. కమిటీ సభ్యులు ఆలపాటి పద్మ, చేకూరి వెంకట లక్ష్మీనారాయణ, బేతపూడి రాజేష్, నూతలపాటి రాజేష్, కొల్లూరి దుర్గాదేవి, మండవ లక్ష్మి, బి.అనూషా, బొడ్డు కోటేశ్వరరావు, వెంటక శ్రీనివాసశర్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం గ్రామంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 100 కిలోల ఆవు పశువుల మలం, 2 కిలోల శనగపిండి, 2 కిలోల బెల్లం, తగినంత ఆవు మూత్రం, గుప్పెడు పుట్టమన్నుతో కలుపుకుని నీడలో ఆరబెట్టాలని, ఇది.. ఎకరాకు 400ల కిలోల ఎరువుతో సమానమని తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాజ్యలక్ష్మి, పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

ఇంటూరు(వేమూరు): ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ అబ్దుల్ సత్తార్ అన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో ఈ-క్రాప్ నమోదును అయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు, కౌలు రైతులకు అందిస్తున్న రాయితీలు పొందాలంటే సాగు చేస్తున్న పంటలను ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి లోకేశ్వరి, ఏఈవో శ్రీకాంత్, వీఏఏలు మణికంఠ, భార్గవి పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ బదిలీ

భట్టిప్రోలు: శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి జి. శ్రీరాములు ఉద్యోగోన్నతిపై శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖర రావు ఉన్నతాధికారుల సూచనల మేరకు ఉత్తర్వులను భట్టిప్రోలు పంచాయతీకి పంపారు. గురువారం సర్పంచ్ దారా రవికిరణ్మయి చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలను ఆయన అందుకున్నారు.



గోపరాజు భౌతిక కాయానికి మంత్రి నాగార్జున, ఎంపీ సురేష్, మిలటరీ అధికారులు నివాళి



తల్లిదండ్రులు నాంచారయ్య, మంగమ్మకు గోపరాజు యూనిఫామ్, జెండా అందచేస్తున్న కెప్టెన్ రిషబ్ సూద్

జోహార్..గోపరాజు



సైనిక లాంఛనాలతో శ్మశాన వాటికకు తీసుకొస్తున్న దృశ్యం

భట్టిప్రోలు: పల్లెకోనకు చెందిన అమర జవాను పురమా గోపరాజు (26) అంత్యక్రియలు స్వగ్రామంలో గురువారం సైనిక లాంఛనాలతో నిర్వహించారు. గోపరాజు మృతదేహాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి మిలటరీ అధికారులు, గ్రామస్తులు భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్ పక్కనే ఉన్న స్మశాన వాటికకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు జోహార్ గోపరాజు అంటూ నినాదాలు చేస్తూ.. నివాళులర్పించారు.



గాలిలో కాల్పులు నిర్వహిస్తున్న మిలటరీ సిబ్బంది